


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 26-01-2025 | సంపుటి - 21 | సంచిక -278 | రూ : 4 | పేజీలు: 8






# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 26-01-2025 | సంపుటి - 21 | సంచిక -278 | రూ : 4 | పేజీలు: 8




# పథకాల పండగ నేడే

- 606 గ్రామాల్లో లాంఛనంగా నాలుగు స్కీంలకు శ్రీకారం
- రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో ఫిబ్రవరి నుంచి మార్చి వరకు అమలు
- చంద్రవంచలో పాల్గొననున్న సీఎం
- మంత్రులు, అధికారులతో జరిగిన సమీక్షలో నిర్ణయం

హైదరాబాద్: రాష్ట్రంలో నాలుగు ప్రతిష్ఠాత్మక పథకాలకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం నుంచి రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రారంభిస్తోంది. హైదరాబాద్ నగరం మినహా మిగిలిన 606 మండలాల్లోని ఒక్కో గ్రామంలో నాలుగు పథకాలకు అర్హులైన లబ్ధిదారులందరికీ సాయం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రజాప్రతినిధుల సమక్షంలో ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు పథకాల పండగ ప్రారంభోత్సవం జరుగుతుంది. మధ్యాహ్నం 2.30 వరకు సాయం పంపిణీ జరుగుతుంది. నారాయణపేట జిల్లా కోస్గి మండలం చంద్రవంచ గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పథకాలను ప్రారంభించనున్నారు. శనివారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నాలుగు పథకాల అమలుపై సీఎం అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ, పౌరసరఫరాలు, గృహ నిర్మాణశాఖల మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ శాంతికుమారి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. సమీక్ష అనంతరం మంత్రులు సచివాలయంలో సమావేశ వివరాలను, పథకాల అమలు గురించి వెల్లడించారు.

**మార్చి వరకు గుర్తింపు ప్రక్రియ: భట్టి**

"రైతు భరోసా, **తరువాయి 2లో**

# కెమెరామెన్ లేకుండానే..
# ఏఐ సాంకేతికతతో సీఎం ప్రెస్‌మీట్

- కృత్రిమ మేధతో వీడియో రికార్డింగ్, లైవ్ కవరేజీ

అమరావతి: అత్యాధునిక సాంకేతికత వినియోగంలో ముందుండే ముఖ్యమంత్రి చంద్రబాబు.. కృత్రిమ మేధను (ఏఐ) వినియోగించుకుని శనివారం వినూత్నంగా ప్రెస్‌మీట్ నిర్వహించారు. వీడియోగ్రాఫర్లు, కెమెరామెన్ లేకుండా.. పూర్తిగా ఏఐతో పనిచేసే వ్యవస్థను వినియోగించారు. ఉండవల్లిలోని సీఎం నివాసంలో 4 కెమెరాలతో మల్టీవీడియో కెమెరా వ్యవస్థ ఏర్పాటుచేశారు. దీనిద్వారా లైవ్ కవరేజీ అందించారు. సమావేశ మందిరంలోకి చంద్రబాబు వచ్చిన సమయంలో ఒక కెమెరాకు సూచనలు ఇవ్వడం ద్వారా ఆయన్ను కేంద్రంగా చేసుకుంటూ అదే వీడియో రికార్డింగ్ మొదలుపెట్టింది. చంద్రబాబు సెంటర్ ఫ్రేమ్‌లో ఉండేలా చూసుకుంటూ.. అవసరమైన సర్దుబాట్లు చేసుకొని వీడియో ఔట్‌పుట్ ఇచ్చింది. 8 మందితో చేసే పనిని ఈ ఏఐ కెమెరా వ్యవస్థ ద్వారా ఒక్కరితోనే చేయొచ్చు. ఫలితంగా సమావేశ మందిరంలో ఎక్కువమంది అటూ, ఇటూ తిరగాల్సిన అవసరం ఉండదు. గందరగోళానికి తావుండదు. నో మ్యాన్ విధానంలో ఆటోమేటిక్‌గా పని జరుగుతుంది. దావోస్ పర్యటన విశేషాలు చెప్పేందుకు చంద్రబాబు శనివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఈ ఏఐ సాంకేతికతను వినియోగించారు. మంత్రి లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ ఏఐ సాంకేతిక కెమెరా వ్యవస్థను ఏర్పాటు చేయించారు. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయమైన ఉండవల్లి నివాసంలో ప్రభుత్వ నిధులతో ఈ వ్యవస్థ ఏర్పాటు చేసే అవకాశమున్నా.. లోకేశ్ అందుకు అంగీకరించలేదు. తన సొంత నిధులతో దాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు.




# వందేళ్ల అవసరాలకు తగ్గట్టుగా
# 'ఉస్మానియా' నిర్మాణం



- సీఎం రేవంత్ ఆదేశం

హైదరాబాద్: కొత్తగా నిర్మించబోయే ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు కావాల్సిన సకల సౌకర్యాలు కల్పించాలని, అవయవ మార్పిడి, అత్యవసర సమయాల్లో రోగుల తరలింపునకు వీలుగా.. హెలిప్యాడ్ నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఆసుపత్రి నిర్మాణానికి ఈ నెల 31న గోషామహల్‌లో సీఎం శంకుస్థాపన చేయనున్నారు. **తరువాయి 2లో**

## సాయుధ దళాలకు 93 శౌర్య పురస్కారాలు

* ఇద్దరికి 'కీర్తిచక్ర'.. 14 మందికి 'శౌర్యచక్ర'

దిల్లీ: సాయుధ దళాల్లో పనిచేస్తున్న 93 మందికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా శౌర్య పురస్కారాల అందజేతకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శనివారం ఆమోదముద్ర వేశారు. ఇందులో ఇద్దరికి కీర్తిచక్ర, 14 మందికి శౌర్యచక్ర అవార్డులు ఉన్నాయి. దేశంలో రెండో అత్యున్నత శౌర్య పురస్కారమైన కీర్తిచక్రను మేజర్ మన్‌జీత్, నాయక్ దిలావర్ ఖాన్ (మరణానంతరం)లకు అందజేయనున్నారు. **తరువాయి 2లో**



# వైద్యనగధీరుడు

- ఏఐజీ ఛైర్మన్ నాగేశ్వరరెడ్డికి దక్కిన గౌరవం
- దేశంలో 3 పద్మ పురస్కారాలు అందుకున్న ఏకైక వైద్యుడు



హైదరాబాద్: ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ ఆసుపత్రి ఛైర్మన్, ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్య నిపుణులు డాక్టర్ దువ్వూరి నాగేశ్వరరెడ్డిని భారత ప్రభుత్వ రెండో అత్యున్నత పౌర పురస్కారం పద్మవిభూషణ్ వరించింది. ఆయనను ఇప్పటికే పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డులతో కేంద్రం సత్కరించింది. తాజాగా పద్మవిభూషణ్ పురస్కారాన్ని ప్రకటించడంతో దేశంలో 3 పద్మ పురస్కారాలను అందుకున్న ఏకైక వైద్యుడిగా డాక్టర్ నాగేశ్వరరెడ్డి చరిత్ర సృష్టించారు. తెలుగు ప్రజల ఖ్యాతి, తెలుగు వైద్యుల గొప్పతనాన్ని మరోసారి దేశానికి తెలిసేలా చేశారు. ఏపీలోని విశాఖపట్నంలో ఆయన జన్మించారు. కర్నూలు మెడికల్ కాలేజ్‌లో ఎంబీబీఎస్, మద్రాస్ మెడికల్ కాలేజీలో **తరువాయి 2లో**



## మహా కుంభమేళాకు
# 73 దేశాల దౌత్యవేత్తలు

ప్రయాగ్‌రాజ్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు భారీగా భక్తులు తరలివస్తున్నారు. ఈ క్రమంలోనే 73 దేశాలకు చెందిన దౌత్యవేత్తలు ప్రయాగ్‌రాజ్‌కు రానున్నారు. రష్యా, ఉక్రెయిన్, అమెరికా, జపాన్, జర్మనీ, నెదర్లాండ్, కెనడా, స్విట్జర్లాండ్, స్వీడన్, సహా 73 దేశాల దౌత్యవేత్తలు ఫిబ్రవరి 1న త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు.

# జమిలితో సుపరిపాలన

విధానాల్లో అనిశ్చితి తగ్గుతుంది

జాతిని ఉద్దేశించి రాష్ట్రపతి గణతంత్ర ప్రసంగం **2లో**

## దేశ ప్రజలకు ప్రధాని మోదీ రిపబ్లిక్ డే శుభాకాంక్షలు

76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 'దేశ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు. ఈ రాజ్యాంగాన్ని రూపొందించి.. ప్రజాస్వామ్యం, గౌరవంతో పాటు ఐక్యతగా దేశ అభివృద్ధి ప్రయాణం సాగేలా కృషి చేసిన మహనీయులందరికీ ఈ సందర్భంగా నివాళులర్పిస్తున్నా. ఈ వేడుక మన రాజ్యాంగ విలువలను కాపాడుతుందని, బలమైన, సంపన్నమైన దేశాన్ని నిర్మించే దిశగా మన ప్రయత్నాలను బలోపేతం చేస్తుందని ఆశిస్తున్నా' అని మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు.



## సైనిక సత్తా చాటనున్న
# గణతంత్ర వేడుక

- అరెస్టు వారెంటు జారీ చేసిన ముంబయి కోర్టు




దిల్లీ: దేశ సాంస్కృతిక వారసత్వ వైభవాన్ని, సైనిక శక్తి సామర్థ్యాలను చాటేలా 76వ గణతంత్ర దినోత్సవాన్ని ప్రభుత్వం అత్యంత ఘనంగా నిర్వహించనుంది. భారత రాజ్యాంగం 75 వసంతాలు పూర్తి చేసుకోవడం ఈ గణతంత్ర దినోత్సవానికి మరింత ప్రాధాన్యతనిచ్చింది. 'స్వర్ణిమ్ భారత్, విరాసత్ ఔర్ వికాస్' అనే ఇతివృత్తంతో ఈసారి కవాతులో పాల్గొనే శకటాలకు రూపకల్పన చేశారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సైనిక బలగాల గౌరవ వందనం స్వీకరిస్తారు. ఇండోనేసియా **తరువాయి 2లో**

# సాయుధ దళాలకు 93 శౌర్య పురస్కారాలు

(మొదటిపేజీ తరువాయి)

శౌర్యచక్ర అవార్డులకు ఎంపికైన 14 మందిలో ముగ్గురికి మరణానంతరం ఈ గౌరవం దక్కనుంది. వీటితోపాటు రక్షణ సిబ్బందికి 305 గౌరవ మెడల్స్‌ను రాష్ట్రపతి ఆమోదించారు.

**942 మంది పోలీసు సిబ్బందికి పతకాలు**

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర హోంశాఖ పోలీసు, ఫైర్ సర్వీసు, హోంగార్డు, సివిల్ డిఫెన్స్ విభాగాల్లో విశేష సేవలందించిన సిబ్బందికి వివిధ పోలీసు పతకాలను ప్రకటించింది. దేశవ్యాప్తంగా 942 మంది శౌర్య, సేవా పతకాలకు ఎంపికైనట్లు శనివారం అవార్డుల జాబితాను విడుదల చేసింది. ఇందులో 95 మందికి శౌర్య పతకాలు, 101 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 746 మందికి పోలీస్ విశిష్ట సేవా పతకాలను (మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్) ప్రకటించారు. తెలుగు రాష్ట్రాల నుంచి పలువురికి ఈ పురస్కారాలు దక్కాయి. సీబీఐకి చెందిన 31 మంది అధికారులకు సైతం పోలీసు పతకాలను ప్రకటించారు. ఇందులో ఆరుగురికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, మిగతా 25 మందికి విశిష్ట సేవా పతకాలు దక్కాయి. సీబీఐ జేడీ ఘన్‌శ్యాం ఉపాధ్యాయ్ రాష్ట్రపతి విశిష్ట సేవా పతకానికి ఎంపికయ్యారు.

# వందేళ్ల అవసరాలకు తగ్గట్టుగా 'ఉస్మానియా' నిర్మాణం

(మొదటిపేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో శనివారం రేవంత్ తన నివాసంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి సమీక్ష నిర్వహించారు. ''ఆసుపత్రికి సంబంధించిన ఏ విషయంలోనూ రాజీపడొద్దు. వచ్చే వందేళ్ల అవసరాలకు తగ్గట్టు నిర్మాణం ఉండాలి. ఆసుపత్రి భవన నిర్మాణాలతో పాటు బోధన సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులకు వేర్వేరుగా నిర్మించే హాస్టల్ భవనాల విషయంలోనూ పూర్తి నిబంధనలు పాటించాలి. ఆసుపత్రికి రాకపోకలు సాగించేలా నలువైపులా రహదారులుండాలి. ఆసుపత్రికి వచ్చే రోగులు, సహాయకులు, సందర్శకుల వాహనాలు నిలిపేందుకు వీలుగా అండర్‌గ్రౌండ్‌లో రెండు అంతస్తుల్లో పార్కింగ్ ఉండాలి. డార్మిటరీ, ఫైర్‌స్టేషన్, క్యాంటీన్, మూత్రశాలలు, ఎస్టీపీలు నిర్మించాలి. మృతదేహాలను భద్రపర్చేందుకు ఆధునిక సౌకర్యాలతో మార్చురీ, బాడీ ఫ్రీజింగ్ నిర్మాణాలు ఉండాలి. ఆసుపత్రిలో అడుగుపెట్టగానే ఆహ్లాదకర వాతావరణం ఉట్టిపడాలి'' అని రేవంత్ అన్నారు. ఆసుపత్రి భవన నిర్మాణాలకు సంబంధించిన నమూనాల్లో డిజైన్లను పరిశీలించిన సీఎం పలు మార్పులు సూచించారు. సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి సంయుక్త కార్యదర్శి సంగీత సత్యనారాయణ, వైద్యారోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ, ఫ్లాగ్ షిప్ ప్రోగ్రామ్స్ కమిషనర్ శశాంక, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

**నేడు అంబేడ్కర్ వర్సిటీకి సీఎం**

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందర్శించనున్నారు. వర్సిటీ ప్రాంగణంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి, పలు భవనాలకు శంకుస్థాపన చేయనున్నారు. సీఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు హాజరు కానున్నారు. డిజిటల్ రిసోర్స్ సెంటర్, సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ సెంటర్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, సిబ్బంది క్వార్టర్స్‌తో పాటు ఆధునిక బస్సు షెల్టర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

# జమిలితో సుపరిపాలన

దిల్లీ: 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక (జమిలి)' వల్ల భారత్‌కు ఎంతో మేలు జరుగుతుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. ఇది సుపరిపాలనకు కొత్త నిర్వచనాన్ని ఇస్తుందన్నారు. పాలనలో సుస్థిరతను ప్రోది చేయడానికి, విధానాల్లో అనిశ్చితిని తొలగించడానికి, వనరులు పక్కదోవ పట్టడాన్ని తగ్గించడానికి వీలు కల్పిస్తుందని చెప్పారు. ప్రభుత్వంపై ఆర్థిక భారాలను తగ్గించడానికి దోహదపడుతుందన్నారు. ఆదివారం దేశం 76వ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకోనున్న నేపథ్యంలో ఆమె శనివారం జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. గత 75 ఏళ్లలో దేశం సాధించిన పురోగతిని ప్రస్తావించారు. సుసంపన్న, సమ్మిళిత భారత్ సాకారానికి పౌరులందరూ పునరంకితం కావాలని కోరారు.

''ఈ గణతంత్ర దినోత్సవం మనకు ప్రత్యేకం. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు అయింది. దేశం మొత్తం గర్వించదగిన సందర్భం ఇది. మన లక్ష్యాల దిశగా నిజమైన ప్రయాణం సాగుతోంది. అంతర్జాతీయంగా నాయకత్వం వహించేలా భారత్ ఎదిగింది. భరతమాత విముక్తి కోసం త్యాగాలు చేసిన వారిని స్మరించుకోవాలి. ఒక జాతి ప్రస్థానంలో 75 ఏళ్లు అనేది స్వల్పకాలమే.. భారత్‌కు మాత్రం ఇది చెప్పుకోదగ్గ సమయమే. దీర్ఘకాలంగా నిద్రాణంగా ఉన్న స్ఫూర్తిని పునరుద్ధరించడానికి, ప్రపంచ దేశాల్లో తన హోదాను తిరిగి సాధించడానికి భారత్ ఈ 75 ఏళ్లలో కృషి చేసింది.'' అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

**సంస్కరించుకుంటున్నాం..**

''వలసపాలన భావజాలాన్ని వదిలించుకోవడానికి జరుగుతున్న ప్రయత్నాలను చూస్తున్నాం. ఇలాంటి సంస్కరణలకు సాహసోపేత దార్శనికత అవసరం. పాత క్రిమినల్ చట్టాల స్థానంలో భారతీయ సంప్రదాయాలను ప్రతిబింబించే కొత్త చట్టాలను ప్రభుత్వం తెచ్చింది. ఇవి శిక్షలతో సరిపెట్టకుండా న్యాయాన్ని అందించడానికి, మహిళలు, పిల్లలపై జరిగే నేరాలను ఎదుర్కోవడానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయి'' అని ముర్ము చెప్పారు.

**నాడే అతివల చురుకైన పాత్ర**

''భారత రాజ్యాంగ సభలో విభిన్న వర్గాలకు ప్రాతినిధ్యం లభించింది. 15 మంది మహిళా సభ్యులు అందులో ఉన్నారు. దేశ ప్రజాస్వామ్య కార్యాచరణను తీర్చిదిద్దడంలో వారు కీలక పాత్ర పోషించారు. ప్రపంచంలోని అనేకచోట్ల మహిళా సమానత్వం అనేది సుదూర లక్ష్యంగానే ఉన్నప్పుడే భారతీయ మహిళలు.. దేశ భవితను నిర్దేశించే కసరత్తులో చురుకైన పాత్ర పోషించారు'' అని ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు.

**ఎంతో పురోగతి సాధించాం..**

''స్వాతంత్ర్యం సమయంలో దేశంలోని అనేక ప్రాంతాలు తీవ్ర దారిద్ర్యం, ఆకలిని ఎదుర్కొన్నాయి. అయితే మనం ఆత్మవిశ్వాసాన్ని వీడకుండా, వృద్ధికి అనువైన పరిస్థితులను సృష్టించుకున్నాం. ప్రపంచ ఆర్థిక తీరుతెన్నులను తీర్చిదిద్దడంలో భారత ఆర్థిక వ్యవస్థ ముఖ్యపాత్ర పోషిస్తోంది. ఈ పరివర్తనకు మూలాలు.. రాజ్యాంగంలోనే ఉన్నాయి. గత కొన్నేళ్లలో మంచి ఆర్థిక వృద్ధి రేటును దేశం సాధిస్తోంది. దీనివల్ల ఉద్యోగావకాశాలు మెరుగుపడ్డాయి. రైతులు, కార్మికుల ఆదాయం పెరిగింది. అనేకమంది పేదరికం నుంచి బయటపడ్డారు. సమ్మిళిత వృద్ధి, ప్రజా సంక్షేమం, గృహనిర్మాణం, సురక్షిత తాగునీటి సరఫరా వంటి అవసరాలు తీర్చడానికి, సుపరిపాలన ప్రమాణాలనుపునర్‌నిర్వచించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. అణగారిన వర్గాలు.. ముఖ్యంగా ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలకు ఆసరా అందిస్తోంది'' అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

**విద్యలో ముందడుగు..**

భవిష్యత్ తరాన్ని తీర్చిదిద్దడంలో విద్యకు చాలా ప్రాముఖ్యత ఉందని రాష్ట్రపతి తెలిపారు. గత దశాబ్ద కాలంలో ఈ రంగంలో పెట్టుబడులను ప్రభుత్వం పెంచిందన్నారు. దీనివల్ల విద్యలో నాణ్యత, మౌలిక వసతులు, డిజిటల్ సేవల వినియోగం మెరుగుపడ్డాయని చెప్పారు. కొత్త టీచర్లలో 60 శాతం మందికిపైగా మహిళలే ఉంటున్నారని తెలిపారు. ''ప్రాంతీయ భాషల్లో బోధనకు ప్రోత్సాహం దక్కింది. దీనివల్ల విద్యార్థుల పనితీరు మెరుగుపడింది. పాఠశాల విద్యకు బలమైన పునాది పడటం వల్ల శాస్త్ర, సాంకేతిక రంగాలు సహా విజ్ఞానానికి సంబంధించిన అనేక శాఖల్లో పురోగతి సాధ్యమైంది'' అని ముర్ము చెప్పారు. ఇటీవల రోదసిలో డాకింగ్ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)ను ఆమె కొనియాడారు.

# నలుగురు న్యాయమూర్తుల ప్రమాణస్వీకారం



హైదరాబాద్: తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నియమితులైన నలుగురు అదనపు న్యాయమూర్తులు ప్రమాణస్వీకారం చేశారు. జస్టిస్ రేణుకా యారా, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు, జస్టిస్ ఇ.తిరుమలదేవి, జస్టిస్ బి.ఆర్.మధుసూదన్‌రావుతో హైకోర్టు సీజే జస్టిస్ సుజయ్ పాల్ ప్రమాణం చేయించారు. ఇంతకుముందు రేణుక యారా సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జిగా, నందికొండ నర్సింగ్‌రావు సిటీ స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్ జడ్జిగా, ఇ.తిరుమలాదేవి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్, విజిలెన్స్ రిజిస్ట్రార్‌గా, బి.ఆర్.మధుసూదన్‌రావు హైకోర్టు రిజిస్ట్రార్ (పరిపాలన)గా బాధ్యతలు నిర్వర్తించారు. 42 మంది న్యాయమూర్తులు ఉండాల్సిన తెలంగాణ హైకోర్టులో ప్రస్తుతం 26 మంది సేవలం దిస్తున్నారు. ఈ నలుగురి నియామకంతో ఆ సంఖ్య 30కి చేరింది.

# సైబర్ క్రైమ్ బాధితులకు రూ.22 లక్షలు రిఫండ్..

సైబర్ నేరాల బారిన పడి డబ్బు కోల్పోయిన బాధితులకు తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు అండగా నిలుస్తున్నారు. తాజాగా వివిధ కేసుల్లో మోసపోయిన బాధితులకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు నగదు రీఫండ్ చేయించారు. ఐదు కేసుల్లో బాధితులకు దాదాపు రూ.22 లక్షల నగదును తిరిగి అప్పగించింది. ఆస్ట్రేలియాలో ఉద్యోగం ఉందని చెప్పి ఓ బాధితుడు నుంచి దాదాపు రూ.10 లక్షలు కాజేసిన సైబర్ నేరాగాళ్లు.. బాధితుడికి రూ.1.51 లక్షలు పోలీసులు రికవరీ చేయించారు. కాగా, దేశంలో ప్రతి సంవత్సరం లక్షలాది మంది ప్రజలు సైబర్ నేరాలకు గురవుతున్నారని నివేదికలు చెబుతున్నాయి. దేశంలోనే సైబర్ నేరాల్లో తెలంగాణ టాప్ 5లో ఉన్నట్లు ఇటీవలి 'తెలంగాణ సైబర్ నేరాల వార్షిక నివేదిక' చెబుతోంది. ఈ క్రమంలోనే సైబర్ నేరాలకు గురికాకుండా ప్రజలకు తెలంగాణ పోలీసులు ఎప్పుడు అవగాహన కల్పిస్తూ ఉన్నారు.

# పథకాల పండగ నేడే

(మొదటిపేజీ తరువాయి)

ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు నాలుగు పథకాలు లాంఛనంగా ప్రారంభించబోతున్నాం. ప్రతి మండలంలోని ఒక గ్రామంలో నూరుశాతం అమలుచేస్తాం. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా.. భూమిలేని నిరుపేదలై, ఉపాధి హామీ పథకంలో 20 రోజులపాటు పనిచేసిన వారందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లభిస్తుంది. గ్రామసభలు నిర్వహించి అర్హత కలిగిన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించాం. లక్షల్లో దరఖాస్తులు వచ్చినందున ఆదివారం నుంచి మార్చి వరకు లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది'' అని భట్టి పేర్కొన్నారు.

* **రేషన్ కార్డుదారులందరికీ ఇకపై సన్నబియ్యం: ఉత్తమ్**

''దేశచరిత్రలో ఇదో ప్రత్యేక సందర్భం. ఒకేసారి ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేయడం మొదటిసారి. రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుంది. కార్డుల విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దు. సామాజిక ఆర్థిక సర్వేలు, ప్రజాపాలన, ప్రజావాణి లేదా మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్న వారందరినీ పరిగణనలోకి తీసుకున్నాం. జాబితాలో లేనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు. కార్డుల జారీ ప్రక్రియ ముగిశాక.. అన్ని పేద కుటుంబాలకు నాణ్యమైన సన్నబియ్యాన్ని ఉచితంగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది'' అని ఉత్తమ్ వెల్లడించారు.

* **రైతు సంక్షేమమే ధ్యేయం: తుమ్మల**

''దేశంలో ఎక్కడాలేని విధంగా రైతు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుభరోసా కోసం రూ.7,625 కోట్లు ఇచ్చాం. రూ.22,000 కోట్లతో రుణమాఫీ అమలు చేశాం. ఇవిగాక బోనస్, మద్దతు ధరల పంట ఉత్పత్తుల కొనుగోలు తదితరాలకు భారీగా నిధులు వెచ్చిస్తున్నాం. వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏటా రూ.12,000 సాయం చేయబోతున్నాం'' అని తుమ్మల చెప్పారు.

* **అనర్హులకు ఇళ్లు వస్తే రద్దుకు వెనుకాడం: పొంగులేటి**

''రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుండకపోయినా ఇచ్చినమాట ప్రకారం నాలుగు పథకాలను ప్రారంభిస్తున్నాం. ప్రతి అంశాన్నీ ప్రజల ముందే చర్చించి నిర్ణయాలు తీసుకునే అలవాటు ఈ ప్రభుత్వానిది. అందుకే గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాం. గ్రామసభల్లో కొన్ని రాజకీయపార్టీలు ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని కుట్రలు చేశాయి. అర్హులైన పేదలెవ్వరూ అభద్రతకు గురికావద్దు. భారాస ఎంత గింజుకున్నా చిత్తశుద్ధితో పథకాలను అమలు చేస్తాం. ఎలాంటి పైరవీలు లేకుండా నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం. ఇవి అనర్హులకు వచ్చినట్లు తేలితే రద్దు చేయడానికి వెనుకాడం'' అని పొంగులేటి తెలిపారు.

# వైద్యనగధీరుడు

(మొదటిపేజీ తరువాయి)

ఎండీ, చండీగఢ్‌లోని పీజీఐఎంఈఆర్‌లో డీఎం పూర్తి చేశారు. నిమ్స్‌లో గ్యాస్ట్రోఎంటరాలజీ నిపుణులుగా సేవలందించిన డాక్టర్ నాగేశ్వరరెడ్డి అంచెలంచెలుగా ఎదిగారు. హైదరాబాద్‌లో ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ ఆసుపత్రిని స్థాపించారు. ప్రస్తుతం 40 రకాల వైద్య ప్రత్యేకతలతో ఏఐజీ రోగులకు సేవలందిస్తోంది. నాలుగు దశాబ్దాలకుపైగా వైద్య రంగంలో ఉంటున్న ఆయన.. వైద్య ఆవిష్కరణలు, విద్య, పరిశోధన, రోగుల సేవలకు తన జీవితాన్ని అంకితం చేశారు. జీఐ ఎండోస్కోపీలో ఆయన నైపుణ్యం కొత్త ప్రమాణాలను నెలకొల్పింది. పెరోరల్ ఎండోస్కోపిక్ మయోటమీ (పీఓఈఎం)ని పరిచయం చేసిన మొదటి వైద్యుడు ఈయనే. ఎండోస్కోపీ పిత్తవాహిక చికిత్స కోసం ఉపయోగించేందుకు నాగిస్టెంట్‌ను అభివృద్ధి చేశారు. ప్రపంచ ఎండోస్కోపీ ఆర్గనైజేషన్‌కు తొలి భారతీయ అధ్యక్షుడిగా పనిచేశారు. గ్రామీణ ప్రాంతంలో ఆరోగ్య సేవలను అందించేందుకు ఏషియన్ హెల్త్‌కేర్ ఫౌండేషన్ (ఎహెచ్ఎఫ్)ను స్థాపించారు. ఐఐఎస్సీ బెంగళూరు, ఐఐటీ కాన్పూర్, ఐఐఐటీ హైదరాబాద్.. ఇలా ఎన్నో ప్రతిష్ఠాత్మక సంస్థలతో కలిసి పలు ప్రాజెక్టులపై పనిచేశారు.

* **కొవిడ్ సమయంలో కీలకంగా...**

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు కొవిడ్ మహమ్మారితో వణికిపోతున్న దశలో డాక్టర్ నాగేశ్వరరెడ్డి, ఆయన బృందం వైరస్‌పై పోరాటంలో కీలకంగా వ్యవహరించింది. కొవిడ్ 19 రోగుల్లో జీర్ణాశయాంతర సమస్యలపై చికిత్సలకు ప్రొటోకాల్‌ను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించారు. రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గైడ్‌లైన్స్ బుక్ రిలీజ్ చేశారు. ఈ పుస్తకం దేశవ్యాప్తంగా అన్ని ఆసుపత్రులకు, వైద్యులకు కొవిడ్ చికిత్సల్లో మార్గదర్శిగా మారింది. పెద్దలకు ఉచితంగా కొవిడ్ వ్యాక్సిన్లు, చికిత్సలు అందించారు. ఆయన అనేక అంతర్జాతీయ అవార్డులను అందుకున్నారు. వాటిలో మాస్టర్ ఆఫ్ ది వరల్డ్ గ్యాస్ట్రోఎంటరాలజీ ఆర్గనైజేషన్ అవార్డు, జీర్ణాశయాంతర ఎండోస్కోపీ రంగంలో అత్యున్నత గౌరవమైన రుడాల్ఫ్ వి.షిండ్లర్ అవార్డులు ఉన్నాయి. ఆయన భార్య క్యారల్ యాన్ రెడ్డి డెర్మటాలజిస్టుగా సేవలు అందిస్తున్నారు. కుమార్తె సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా అమెరికాలో ఉంటున్నారు.

* **ఎంతో గౌరవంగా భావిస్తున్నా: డాక్టర్ నాగేశ్వరరెడ్డి**

పద్మవిభూషణ్ అవార్డును అందుకోవడం చాలా గౌరవంగా భావిస్తున్నా. ఏఐజీ వైద్య బృందం మొత్తానికి, మాపై నమ్మకం ఉంచే రోగులకు ఈ ఘనత దక్కుతుంది. ఇది కేవలం వ్యక్తిగత మైలురాయి కాదు. వైద్య స్ఫూర్తికి, ఆరోగ్య సంరక్షణ, ఆవిష్కరణలో మన దేశ గొప్పతనాన్ని చాటిచెబుతుంది. ఆరోగ్య సంరక్షణ అంటే అనారోగ్యాన్ని నయం చేయడం మాత్రమే కాదు.. గౌరవం, సానుభూతితో మనిషికి సేవ చేయడం అని నేను గట్టిగా నమ్ముతాను. తెలుగు బిడ్డగా, భారతీయుడిగా ప్రజల ఆరోగ్యం, శ్రేయస్సుకు తోడ్పాటు అందించడానికి నిరంతరం కృషి చేస్తాను. ఈ అవార్డును నాపై మరింత బాధ్యత పెంచింది.

# సైనిక సత్తా చాటనున్న గణతంత్ర వేడుక

(మొదటిపేజీ తరువాయి)



అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. త్రివిధ దళాలు సంయుక్తంగా ఒక శకటాన్ని తీసుకురావడం ఈసారి ప్రత్యేకత. భూమిపై, గగనతలంలో, సముద్రంలో జరిగే యుద్ధ దృశ్యాల సమ్మేళనంగా శకటాన్ని తీర్చిదిద్దారు. అత్యాధునిక బ్రహ్మోస్ క్షిపణి, పినాకా రాకెట్ లాంచర్, భూతలం నుంచి ఆకాశంలోకి ప్రయోగించే ఆకాశ్ క్షిపణులు, యుద్ధ ట్యాంకులను ప్రదర్శించనున్నారు. డీఆర్‌డీఓ రూపొందించిన క్షిపణి ప్రళయ్ తొలిసారి దర్శనమివ్వనుంది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 16 శకటాలు, కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలకు చెందిన 15 శకటాలు కవాతులో ఆకర్షణగా నిలవనున్నాయి.

## ప్రజా ప్రతినిధులు ప్రజలతో మమేకమై వారి అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేయాలి

*** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ప్రజా ప్రతినిధులు ప్రజలతో మమేకమై వారి అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేయాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ పాలకవర్గం పదవి కాలం పూర్తయిన సందర్భంగా పాలకవర్గం సభ్యులకు ఏర్పాటుచేసిన వీడ్కోలు సమావేశానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై పాలకవర్గం సభ్యులను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల్లో ప్రత్యేకమైన గుర్తింపు రావాలంటే ప్రజాప్రతినిధులు ప్రజలతో మమేకమై వారి సంక్షేమని, అభివృద్ధికై పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీహరి, చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు భాగస్వాములు కావాలి

*** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు భాగస్వాములు కావాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అన్నారు. శనివారం జీడిమెట్ల డివిజన్ హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీ నూతన సంక్షేమం సభ్యులు ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ని పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అదేవిధంగా ఈ నెల 30వ తేదీన శ్రీ ముత్యాలమ్మ దేవి ఆలయంలో నిర్వహించనున్న ఆలయ వార్షికోత్సవ కార్యక్రమానికి హజరుకావాలని ఆహ్వానించి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీవాసులందరూ ఐకమత్యం, సమిష్టి కృషితో పనిచేసినప్పుడు కాలనీ వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీ నూతన అధ్యక్షులు కుంట సిద్ధిరాములు, ప్రధాన కార్యదర్శి తోకల నగేష్ రెడ్డి, గౌరవాధ్యక్షులు ఐ. ప్రభాకర్ రెడ్డి, కోశాధికారి రాజు, ఆలయ కమిటీ చైర్మన్ టి. రాజేశ్వర్, కోశాధికారి డి. బాల్ రాజ్, సభ్యులు మల్లేశం, గోపాల్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## పౌరులు అందరూ నిష్పక్షపాతంగా ప్రశాంతంగా ఎన్నికలలో ఓటు వేయాలి

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుంచి కొత్తగూడెం క్లబ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ముందుగా పోస్ట్ ఆఫీస్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం గురించి తెలియజేయడం జరిగింది. కొత్తగూడెం క్లబ్ లో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ మన జిల్లాలో ఉన్న పౌరులు అందరూ నిష్పక్షపాతంగా ప్రశాంతంగా ఎన్నికలలో ఓటు వేయాలన్నారు. మతం జాతి కులం వర్గం భాష లేదా ఎటువంటి ఒత్తిళ్లకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికల్లో ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని వకృత్వ ,వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేయడం జరిగింది. బెస్ట్ ఎలక్ట్రోరల్ ప్రాక్టీస్ అవార్డు ను కొత్తగూడెం తాసిల్దార్ పుల్లయ్య కి డి ఎల్ యం టి పి. సాయి కృష్ణ కు అందజేయడం జరిగింది ట్రాన్స్ జెండర్ ఓటర్లకు , సీనియర్ సిటిజన్, దివ్యాంగుల ఓటర్స్ ను కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు సీనియర్ సిటిజన్స్ నూతన ఓటర్లు సుమారు 2000 మంది పాల్గొన్నారు . ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ విద్య చందన, జిల్లా పరిషత్ సీఈవో నాగలక్ష్మి, ఆర్డీవో మధు, డి.ఎస్.పి రెహమాన్, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ స్వామి, ఎలక్షన్ సెల్ తాసిల్దార్ ధారా ప్రసాద్, కొత్తగూడెం తాసిల్దార్ పుల్లయ్య, లక్ష్మీదేవి పల్లి తాసిల్దార్ ప్రసాద్, సుజాతనగర్ తాసిల్దార్ శిరీష, చుంచుపల్లి తాసిల్దార్ కృష్ణ, పాల్వంచ తాసిల్దార్ వివేక్, రంగాప్రసాద్, అంజాద్ భాష ,డి ఎల్ యం టి సాయి కృష్ణ విద్యార్థులు సెయింట్ మేరీస్, సింగరేణి గర్ల్స్, వివేకవర్ధని చెందిన విద్యాసంస్థల వారు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తన ధ్యేయం

*** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) :ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తన ధ్యేయమని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ లోని వివిధ వార్డులలో సుమారు రూ.2.79 కోట్లతో చేపట్టనున్న బీటి రోడ్డు, సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ, వర్షపు నీరు నాల నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 1వ వార్డులలో 162 వ ప్లాట్ నుంచి శ్రీవాణి నిలయం ఫేస్ 2 వరకు సుమారు రూ.50 లక్షల తో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు, 6వ వార్డులలో నూజివీడు సీడ్స్ రూ.21.00 లక్షలతో , డిలైట్ హైట్స్ నుంచి సుప్రభాత్ ఆర్కేడ్ 3 వరకు రూ.39.00 లక్షల తో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులు, 8వ వార్డులోని నాగార్జున కాంపౌండ్ వాల్ నుంచి నాని కుమారి ఇంటి వరకు రూ.10 లక్షలతో బృందావన్ రెసిడెన్సి నుండి వైజయంతి హోమ్స్ వరకు రూ.20.00 లక్షల తో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు, 8వ డివిజన్లోని బాలాజీ గ్రీన్ ల్యాండ్స్ నుంచి ఆంజనేయ స్వామి టెంపుల్ వరకు రూ.12 లక్షల తో చేపట్టనున్న ఎస్డబ్ల్యూజి డ్రైన్ పనులకు, ఎనిమిదవ డివిజన్లోని శ్రీ వేద అవెన్యూ నుంచి వైష్ణవి ఎంక్లేవ్ వరకు రూ.16 లక్షల వ్యయంతో చేపట్టనున్న వర్షపు నీటి నాలా పనులకు, 10వ వార్డులోని సాయి నిలయం నుంచి ఇందుమతి మార్ట్ వరకు సుమారు రూ.19 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఎస్ డబ్ల్యూ జి పైపులైన్ పనులకు , 11వ వార్డులోని ఫార్మా హబ్ నుంచి ఏఎన్ఆర్ రెసిడెన్సి వరకు రూ.11 లక్షల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు, 12వ వార్డులలో శ్రీ బాలాజీ కిరాణా స్టోర్స్ నుంచి శ్రీ గోవిందా ట్రేడర్స్ వరకు రూ.15 లక్షలతో చేపట్టనున్న బిటి రోడ్డు పనులకు, 13వ డివిజన్లోని మసీదు వద్ద సుమారు రూ.20 లక్షలతో చేపట్టనున్న ఎస్. డబ్ల్యూ. జి డ్రైన్ , సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీల్లో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి మౌలిక వసతులను కల్పించామన్నారు. రానున్న రోజుల్లో కూడా కొంపల్లి మున్సిపాలిటీని మరింత అభివృద్ధి పరుస్తామన్నారు. బస్తీ, కాలనీలలో మెరుగైన మౌలిక వసతులు కల్పించి కొంపల్లి మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదితామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, మాజీ ఎంపీపీ సన్న కవితా శ్రీశైలం యాదవ్, కొంపల్లి మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్లు సన్న రవి యాదవ్, చింతల రవీందర్ యాదవ్ (సంజు), మంజుల కుమార్ గౌడ్, మేడంశెట్టి సువర్ణ, పూజారి వసంత లక్ష్మణ్ గౌడ్, తెల్ల కృష్ణవేణి వినోద్, శిరీష ప్రవీణ్, డప్పు కిరణ్, కోఆప్షన్ సభ్యులు వెంకటేష్, వార్డు అధ్యక్షులు, ప్యాక్స్ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, డైరెక్టర్లు సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు సంగీతా రెడ్డి, సీనియర్ నాయకులు చింతల దేవేందర్ యాదవ్, రాకేష్, మహేష్, సుధా, రఘునాథ్, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, కాలనీలవాసులు కిట్టు, సూర్యనారాయణ, రవిశంకర్, రామభద్రం, శ్రీనివాస్ రెడ్డి, నరేష్, రవికుమార్, శివకుమార్, రాజ్ కుమార్, శారదా తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ హయంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ను మోడ్రన్ కార్పొరేషన్ గా అభివృద్ధి పరిచాం

*** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేక దృష్టితో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ను మోడ్రన్ కార్పొరేషన్ గా అభివృద్ధి పరిచారని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అన్నారు. శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాల్లో భాగంగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ పాల్గొని కార్పొరేషన్ పరిధిలో భూగర్భ డ్రైనేజీ, సిసి రోడ్డు, బీటీ రోడ్డు పనులతో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణము పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 13వ డివిజన్ లోని బాలాజీ వెస్ట్ కాలనీ నందు రూ.25 లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులు, 7వ డివిజన్ లోని ఆకృతి అపార్ట్మెంట్స్ వద్ద సుమారు రూ.26 లక్షలతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు, 11వ డివిజన్ లోని కేటీఆర్ కాలనీ నందు సుమారు రూ.20 లక్షల తో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు, 30వ డివిజన్ లోని రామభద్ర అపార్ట్మెంట్ నుంచి జయ దీపిక మెయిన్ లైన్ వరకు సుమారు. రూ.60 లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులు, బేవర్లి ఫార్క్స్ నందు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులు, జర్నలిస్ట్ కాలనీలోని చర్ల ఎల్లమ్మ టెంపుల్ వద్ద సుమారు పది లక్షలతో సీసీ రోడ్డు పనులు, శివాజీ నగర్ నందు సుమారు రూ.25.50 లక్షల తో) భూగర్భ డ్రైనేజీ , సిసి రోడ్డు పనులకు, 28వ వార్డులో కొలం రాజిరెడ్డి హైట్స్ నుంచి హెచ్ఎండబ్ల్యూఎస్ వాటర్ ట్యాంక్ వరకు సుమారు రూ.99 లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. నిజాంపేట్ గ్రామపంచాయతీ స్థాయి నుండి కార్పొరేషన్ స్థాయికి అనతికాలంలోనే ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు., రానున్న రోజుల్లో కూడా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ను మరింత అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కార్పొరేటర్లు ప్రణయ ధనరాజ్ యాదవ్, రవి కిరణ్, కోలన్ మీనా సునీల్ రెడ్డి, రఘూవేంద్ర రావు, బొర్రా దేవి చందు ముదిరాజ్ ,గాజుల సుజాత, ఆవుల పావని జగన్ యాదవ్, చిట్ల దివాకర్, కోఆప్షన్ సభ్యులు ఏనుగుల అభిషేక్ రెడ్డి, సయ్యద్ సలీం, ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, ఎన్ఎంసి మహిళా అధ్యక్షురాలు అర్పిత ప్రకాష్, నాయకులు సాంబాశివా రెడ్డి, మేకల మధుసూదన్, ప్రవీణ్, జశ్వంత్, రామకృష్ణ, స్వామి, దశరథ్, ముత్యాలు, దూసకంటి వెంకటేష్, అజయ్ చౌదరి,ప్రదీప్, కుమార్ రెడ్డి,నాగ శ్రీనివాస్, శివ,నర్సింహా రాజు,మహిళా నాయకురాలు స్వర్ణ కుమారి, యువ నాయకులు ఆనంద్ రెడ్డి, జర్నలిస్ట్ కాలనీ వెల్ఫేర్ అసోసి వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్కర్ల లాలయ్య, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ పాఠశాల ఆధ్వర్యంలో 1000 మీటర్ల జాతీయ పతాకంతో తిరంగా ర్యాలీ






ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పాల్వంచ నారాయణ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వాతంత్ర సమరయోధుల త్యాగాలు, దేశభక్తి ని గుర్తుకు చేస్తూ భారతదేశ ఐక్యతా స్ఫూర్తిని చాటుతూ 1000 మీటర్ల త్రివర్ణ పతాకంతో పాల్వంచ, నెహ్రూనగర్ నారాయణ పాఠశాలలో ప్రారంభమైన దమ్మపేట సెంటర్, అంబెడ్కర్ సెంటర్ల మీదుగా నటరాజ్ సెంటర్ వయా మార్కెట్ ద్వారా బస్టాండ్ వద్ద ముగిసిన ఈ ర్యాలీలో 150 మందికి పైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది చురుగ్గా పాల్గొని ర్యాలీ పొడవునా దేశభక్తి గీతాలు, భారతదేశ ఐక్యత నినాదాలు చేస్తూ దారిపొడవునా ప్రజల్లో జాతీయ భావాన్ని ప్రేరేపించారు, దారిపొడవునా ప్రజలు ఉత్సాహంగా త్రివర్ణ పతాకాన్ని పట్టుకుని, సెల్ఫీలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్వంచ టౌన్ ఎస్ఐ జీవన్ రాజ్ జెండా ఊపి తిరంగా ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూరేటి నరసింహరావు మాట్లాడాడుతూ ప్రపంచ దేశాలలో భారత దేశం గొప్ప వారసత్వాన్ని కలిగివుందని, , విద్యార్థులలో జాతీయ భావాన్ని పెంపొందించడంలో, పటిష్టమైన భారత దేశంకోసం, అందరం సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఖమ్మం నారాయణ పాఠశాలల ఏజీఎం యోగ రాంకీ ఇలాంటి మంచి కార్యక్రమాన్ని చేపట్టినందుకు పాల్వంచ బ్రాంచ్ సిబ్బందిని, ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ క్రాంతి కుమార్, ఈ చాంప్స్ కోఆర్డినేటర్ వినోద, ఈకిడ్స్ కోఆర్డినేటర్ నీలిమ, ఈటెక్నో కోఆర్డినేటర్ ప్రవీణ్, ప్రిన్సిపాల్ పూరేటి నరసింహరావు, టెక్నో ఎడి రామకృష్ణ, ఈచాంప్స్ వైస్ ప్రిన్సిపాల్ రుచిత శ్రీ, మల్లేష్, సుజిత్, అనూష, దీప్తి, పిఇటి వినయ్, ఎ ఒ దుర్గాప్రసాద్ లు పాల్గొన్నారు.

## ప్రజలకు సేవ చేయడం నా అదృష్టం: బండారి



ప్రజా స్ఫూర్తి ,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మున్సిపాలిటీ కూలీలైన్ 35వార్డులో రాజీవ్ పేద ప్రాంత సమైక్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ బండారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.తదనంతరం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న బండారి మాట్లాడుతూ నిరంతరం ప్రజా సేవలో ఉంటానని నమ్ముకున్న జనం కోసం జీవితాంతం పనిచేస్తానని బండారి తెలిపారు. ఈ 5 సంవత్సరంలో నన్ను ఆదరించి అన్ని విధాల సహకరించిన వార్డ్ ప్రజానీకానికి, సోదరులకి, మిత్రులకు కార్యకర్తలాగ రుణపడి ఉంటారని తెలిపారు. 35 వార్డులో కొన్ని కోట్ల తోటి అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాను అభివృద్ధితోపాటు ప్రజలకి అన్ని విధంగా అండగా ఉంటానని తెలిపారు. మరి ఇంకొన్ని మిగిలి పనులు కూడా సంపూర్తిగా నిర్వహిస్తానని తెలిపారు. మా వార్డులో కరోనా టైంలో ప్రాణాలు తెగించి ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. అభివృద్ధిలో భాగంగా కొత్తగూడెం ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేసి 20 కుటుంబాల కు భరోసా కలిగించే అదృష్టంగా కలిగిందని భావిస్తున్నాను . ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఫుడ్ కోర్ట్ వారు కూడా ఘనంగా బండారి దంపతులను సత్కరించారు. ప్రత్యేకంగా బండారి దంపతులను కందుకూరి గణేష్ గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ రుక్మాంగధర్ బండారి, రాజీవ్ గాంధీ పేద ప్రాంత సమైక్య అధ్యక్షురాలు మునిగ సుజాత , ఆర్పి రాజ్యలక్ష్మి, రూప బండారి,ఓబీలు మురళి కుమారి, ఆశా , ఏ. లక్ష్మి కొత్తగూడెం గుడ్ కమిటీ అధ్యక్షులు వరలక్ష్మి , రాజేశ్వరి , టీ.రాధిక ,వనజ, సరోజ ,అనిత, శ్రీదేవి, దీపిక సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఐలయ్య మృతిపట్ల కూనంనేని సంతాపం

*** నివాళులర్పించిన సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ రాష్ట్ర నాయకులు, సుజాతనగర్ మండలానికి చెందిన కాసాని ఐలయ్య మృతిపట్ల సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు సంతాపాన్ని ప్రకటించారు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్యకర్తల సందర్శనార్థం సిపిఎం జిల్లా కార్యాలయంలో ఉంచిన ఐలయ్య మృతదేహాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాసాని ఐలయ్య నిబద్ధతగల కమ్యూనిస్టు నేత అని, కొత్తగూడెం ప్రాంతంలో అనేక ప్రజా ఉద్యమాలు నిర్మించారని, ప్రజలను పోరాటాలవైపు నడిపించారన్నారు. అయన మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని, అయన ఆశయాల సాధనకోసం నేటితరం కమ్యూనిస్టులు కృషి చేయాలన్నారు

# దుండిగల్ మున్సిపాలిటీ ని మరింత అభివృద్ధి పరిచేందుకు కృషి

* కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : రానున్న రోజుల్లో దుండిగల్ మున్సిపాలిటీ ని మరింత అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. శనివారం దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేటలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి మున్సిపాలిటీని మౌలిక వసతుల కల్పనలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దామన్నారు. బౌరంపేట్ 18వ వార్డులో భ్రమరాంబిక మల్లికార్జున ఆలయం వద్ద రూ.90 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, గ్రామంలోని కమాన్ నుండి బొడ్డురాయి వరకు రూ.ఒక్క కోటి పది లక్షలతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డును రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గ్రామ బస్ స్టాప్ నుండి బొడ్డురాయి వరకు గ్రామంలో రూ.45లక్షలతో నూతనంగా నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. అనంతరం 18వ వార్డు కౌన్సిలర్ పల్పనూరి మౌనిక విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ దుండిగల్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కెపి. వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీ పూర్ రాజు లు చూపిన ప్రత్యేక శ్రద్ధ గురించి తెలిపారు. గడిచిన ఐదు సంవత్సరాలలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ , చైర్ పర్సన్ శంభీపూర్ క్రిష్ణవేణి క్రిష్ణ ల సహాయ సహకారాలతో ఎంతో అభివృద్ధి జరిగిందని తెలిపారు. వారి సహాయ సహకారం ఎల్లప్పుడూ గ్రామానికీ ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శంభీపూర్ క్రిష్ణవేణి క్రిష్ణ, వైస్ చైర్మన్ పద్మారావు, పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, బెంబడి వనిత బుచ్చిరెడ్డి, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాచారం సునీత మురళి యాదవ్, పాక్స్ డైరెక్టర్లు భీమ్ రెడ్డి, సత్తిరెడ్డి, మహిపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి, దర్శన్ రెడ్డి, షామీర్పేట్ హనుమంతరావు, కృష్ణారెడ్డి, యాదయ్య, రాజిరెడ్డి, మల్లేష్, జంగారెడ్డి, మహేష్ యాదవ్, రాజు గౌడ్, పద్మా రెడ్డి, వార్డు ప్రెసిడెంట్లు మని శేఖర్, కామేష్, సోమరాజు, గ్రామ పెద్దలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలి

* మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి






మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని , ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి అన్నారు. 15 వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిఆర్ఓ హరిప్రియతో కలిసి జిల్లా అదనపు కలెక్టరు ఉద్యోగులందరితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. డిఆర్ డిఏ ఆధ్వర్యంలో 15 వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు, విద్యార్థులు, యువకులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఇప్పుడు ప్రతి ఏడాదికి నాలుగు సార్లు ఓటరుగా నమోదుకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ఓటరుగా నమోదుకు సమీపంలోని పోలింగ్ కేంద్రానికి వెళ్లి బిఎల్ఓలను సంప్రదించి ఓటరు నమోదుకు ఫామ్ 6 తో పాటు, ఫామ్ 6బి ద్వారా ఓటర్ గుర్తింపు కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని తెలియజేశారు.. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకొని మంచి ప్రజా ప్రతినిధులను ఎన్నుకున్నట్లయితే మన నియోజకవర్గాన్ని, జిల్లాను, రాష్ట్రాన్ని చక్కగా అభివృద్ధి పరచుకోగలుగుతామన్నారు . అనంతరం ఓటు హక్కు పై నిర్వహించిన రంగోలీ పోటీలలో పాల్గొన్న విజేతలకు, స్వీప్ కార్యక్రమాలను బాగా ప్రచారం చేసిన టిఎస్ఎస్ కళాకరులకు జిల్లా అదనపు కలెక్టరు సర్టిఫికెట్లు, మెమెంటోలను ప్రధానం చేసారు . ఈ కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, జిల్లా భూసేకరణ అధికారి శంకర్ కుమార్, డిఆర్ డిఓ సంబశివరావు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల మనోభావాలకనుగుణంగా

# తల్లిదండ్రులు ప్రోత్సహించాలి

* జగద్గిరిగుట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.నర్సింహా

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : విద్యార్థుల మనోభావాలకనుగుణంగా తల్లిదండ్రులు అన్ని విధాలుగా ప్రోత్సహించాలని జగద్గిరిగుట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.నర్సింహా అన్నారు. శుక్రవారం రాత్రి జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూంనగర్ భగత్సింగ్ మార్గ్లో గల శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జగద్గిరిగుట్ట సిఐ కె.నర్సింహ, ఎస్ఐ శంకరయ్య, తెలంగాణ రాష్ట్ర ట్రస్మా అసోసియేట్ అధ్యక్షులు కె.రామేశ్వర్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతుల్ని మంత్రముగ్ధులను చేశాయి. అనంతరం సిఐ నర్సింహ మాట్లాడుతూ కష్టపడి చదివే ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలలదిరోహించడం ఖాయమన్నారు. విద్యార్థులు పట్టుదల కనబరిస్తే ఉన్నత శిఖరాలదిరోహిస్తారని ఏ రంగంలోనైనా కష్టపడే కంటే ఇష్టపడితే కలలు సాకారం చేసుకోవచ్చని తెలిపారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో రాణించే విధంగా విద్యార్థులు ఎదగాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ట్రస్మా అసోసియేట్ అధ్యక్షులు కె.రామేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుండే క్రమశిక్షణ తో పాటు పట్టుదలతో చదివితే భవిష్యత్తులో ప్రతిభావంతులవుతారన్నారు. విద్యతోనే సమాజంలో విద్యార్థులు ఉన్నతులుగా ఎదుగుతారన్నారు. పాఠశాల చైర్మన్,కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు మనోభావాలకు అనుగుణంగా విద్యానందిస్తూ వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ప్రతి సంవత్సరం మంచి ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు . అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంచే ప్రతి విద్యార్థి పై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటు















బోధిస్తు విద్యతోపాటు ,క్రీడలు సామాజిక విలువల గూర్చి తెలుపుతూ వారి ఉజ్వల భవితకు పునాదులు వేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, ముగ్గుల పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థుల తల్లులకు బహుమతులను వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గోనే హనుమంత్ రెడ్డి, టపస చైర్మన్ కె.వెంకటేష్, అధ్యక్షులు వినోద్ జాదవ్, ప్రధాన కార్యదర్శి దయాకర్, కోశాధికారి శ్రీశైలం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సయ్యద్ రశీద్, వివిధ పాఠశాలల కరస్పాండెంట్స్ కె.శ్రీనివాస్ రెడ్డి, మధు, నర్సింహులు, సి.హెచ్. నర్సింహులు గౌడ్, అంజనేయులు, ప్రవీణ్ రెడ్డి, ప్రిన్సిపల్ బి.శోభారాణి, ఉపాధ్యాయులు అన్నే ఫాతిమా, ప్రశాంతి, కృష్ణవేణి, మహేశ్వరి, సాజిత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## బెల్టు షాపుల నిర్మూలనతో..

# మునుగోడు లో క్రైమ్ రేట్ తగ్గింది

: మున్సిపల్ పాలక వర్గానికి ఘన సన్మానం
- ఆకట్టుకున్న 601గాంధీ విగ్రహాల ప్రతిమలు, మల్కంబు ప్రదర్శన
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి








చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: నియోజకవర్గ వ్యాప్తంగా బెల్టు షాపుల నిర్మూలనతో.. తెలంగాణ రాష్ట్రంలోనే మునుగోడు నియోజకవర్గంలో క్రైమ్ రేట్ తగ్గిందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం గాంధీ పార్కులో గాంధీ గ్లోబల్ ప్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ సంస్థ ఆధ్వర్యంలో గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హాజరయ్యారు. గాంధీ గ్లోబల్ ట్రస్ట్ నిర్వాహకులు, స్థానిక నాయకులు రాజగోపాల్ రెడ్డికి పూల వర్షంతో ఘనంగా స్వాగతం పలికారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఏర్పాటు చేసిన స్టాళ్లను, 601గాంధీ ప్రతిమలను ప్రదర్శనను, ఆసక్తిగా తిలకించారు. 500మంది విద్యార్థులు గాంధీ వేషధారణ వేశారు. ఆ విద్యార్థుల మధ్య కూర్చుని ఎమ్మెల్యే చరకా తిప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముఖ్యంగా 601గాంధీ విగ్రహ ప్రతిమలు, విద్యార్థులు ప్రదర్శించిన మల్కంబ్ విపరీతంగా ఆకట్టుకుంది. మల్కంబు విద్య ప్రదర్శించిన విద్యార్థులు, విద్యార్థినీలు ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. పదవి విరమణ పొందుతున్న చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, వైస్ చైర్మెన్ బత్తుల శ్రీశైలం గౌడ్, కౌన్సిలర్లను శాలువా, షీల్డులతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలంటే, ప్రతి నిమిషం సద్వినియోగం చేసుకోవాలన్నారు. మునుగోడు అభివృద్ధి ధ్యేయంగా రోజుకు 16గంటలు పనిచేస్తున్నానన్నారు. చౌటుప్పల్ ప్రాంతమంతా కాలుష్యంతో నిండిపోయిందని, స్థానిక నాయకులు రాజీపడొద్దని సూచించారు. ఆస్తులు అంతస్తులు కాదు ఆరోగ్యమే ముఖ్యమన్నారు. తనకు ఏ పదవి వచ్చినా అది నాకు బాధ్యతే..కానీ కిరీటం కాదన్నారు. మంచి పనులు చేసే నాయకులు ప్రజల హృదయాల్లో ఉంటారన్నారు. మునుగోడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకునే బాధ్యత తనతోపాటు మీపై కూడా ఉందన్నారు. తన రాజీనామాతో ఈ ప్రాంత ప్రజలకు మేలు జరిగిందని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో గురించి 24గంటలు ఆలోచిస్తున్నానన్నారు. పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించడమే లక్ష్యమన్నారు. ఉన్న సమస్యల పరిష్కరించడానికి 24గంటలు సరిపోవడం లేదన్నారు.119నియోజకవర్గాలలో మునుగోడు నియోజకవర్గాన్ని నెంబర్ వన్ గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రభుత్వ సొమ్ము, పేదల సొమ్ము జోలికి పోవద్దని హెచ్చరించారు. పదవి విరమణ పొందుతున్న చౌటుప్పల్ మున్సిపల్ పారక వర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ ట్రస్ట్ చైర్మన్ గున్న రాజేందర్ రెడ్డి, మునుగోడు నియోజకవర్గ ఎన్నికల ఇన్చార్జి పబ్బు రాజు గౌడ్, మాజీ జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, గాంధీ గ్లోబల్ మండల అధ్యక్షురాలు వెన్ రెడ్డి సంధ్య, మున్సిపల్ పాలకవర్గం సభ్యులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి, మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, టౌన్ అధ్యక్షుడు సుర్వి నరసింహా గౌడ్, యూత్ అధ్యక్షుడు రాచకొండ భార్గవ్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఐటిడీఏ పీవో రాహుల్ కు స్పెషల్ అవార్డ్

* గవర్నర్ చేతులమీదుగా అవార్డు స్వీకరణ




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ స్పెషల్ అవార్డును అందుకున్నారు. హైదరాబాదులో శనివారం జరిగిన 15వ నేషనల్ ఓటర్ల దినోత్సవ వేడుకలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా పిఓ రాహుల్ అవార్డు స్వీకరించారు. 2024 పార్లమెంట్ ఎన్నికల సందర్భంలో బెల్లంపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ గా బి.రాహుల్ విజయవంతంగా నిర్వహించిన విధులకు గాను ఈ ప్రత్యేక అవార్డును గవర్నర్ చేతుల మీదుగా అందుకున్నారు. రాష్ట్ర గవర్నర్ నుంచి ప్రత్యేక అవార్డును అందుకున్న భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ని ఐటీడీఏ అధికారులు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. గిరిజన అభివృద్ధికి భద్రాచలం ఐటీడీఏ ద్వారా ఎంతగానో కృషి చేస్తున్న పిఓ రాహుల్ భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

# బంజారా లు అన్ని రంగాలలో రాణించాలి

* మాజీ ఎమ్మెల్సీ సభావత్ రాములు నాయక్

.ప్రజాస్ఫూర్తి, కాప్రా : బంజారా లు అన్ని రంగాలలో రాణించాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ సభావత్ రాములు నాయక్ అన్నారు. చర్లపల్లి సిరి గార్డెన్లో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ సభావత్ రాములు నాయక్.. ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.. 1952 జనవరి 30న మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి చేతులమీదుగా ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ప్రారంభమైందని , 72 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికీ 20




జిల్లాల్లో ఆత్మీయ సమ్మేళనాలను పూర్తి చేశామని మిగతా 13 జిల్లాల్లో కూడా పూర్తిచేసి ఈ నెల 30న తెలంగాణ వ్యాప్తంగా వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈనెల 30న అన్ని తండాలలో ఉదయం ఎనిమిది గంటల నుండి 10 గంటల మధ్య సేవాలాల్ జండాలను ఎగురవేయడంతో పాటుగా సేవా కార్యక్రమాలను కూడా చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. అలాగే తండాలు మండల.. జిల్లా నూతన కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం మేడ్చల్ మల్కాజ్గిరి అధ్యక్షుడిగా ధీరావత్ శ్రీను నాయక్ ను ప్రకటించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి హాజరై మాట్లాడారు. ఇందిరా రాజీవ్ గాంధీల హయంలోనే తండాలు.. బంజారాల అభివృద్ధి జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమే బంజారాల సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వలిగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమా నాయక్, బాపు నగర్ మాజీ కౌన్సిలర్ కిషన్ రాథోడ్, ఆల్ ఇండియా బంజారా సేవాసం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ధీరావత్ శ్రీనివాస్ నాయక్, మహంకాళి టెంపుల్ చైర్మన్ ధీరావత్ శంకర్ నాయక్, మారుతి కాలనీ అధ్యక్షులు దిరావత్ శ్రీనివాస్ నాయక్, మేడ్చల్ జిల్లా కౌన్సిల్ నెంబర్ ఇస్లావత్ హరినాయక్, హనుమ నాయక్, దసరత్ నాయక్, మూడవ కిషన్ నాయక్, ధీరావత్ లింగం నాయక్, బుక్య బీమా నాయక్, ధీరావత్ రెడ్డి నాయక్, ధీరావత్ లక్ష్మణ్ నాయక్, నరసింహా నాయక్ గంజి నాయక్ పకీర నాయక్, భాస్కర్ నాయక్ అరుణ బాయ్ వివిధ జిల్లాల నుండి గోర్ బంజారా నాయకులు పెద్ద ఎత్తున విజయవంతం చేయడం జరిగింది.

# ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన ధ్యేయం

* ఆల్వీన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన ధ్యేయమని ఆల్వీన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని అంబెడ్కర్ నగర్ లో డ్రైనేజీ లైన్ నిండిపోయి పొంగుతుదన్న విషయాన్ని కాలనీ వాసులు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురాగా కార్పొరేటర్ జి.ఎచ్.ఎం.సి సిబ్బందితో ఎయిర్ టెక్ యంత్రం సహాయంతో పూడికను క్లియర్ చేయించారు. ఈ సందర్భంగా కాలనీలో, బస్తీలలో ఎలాంటి సమస్యలున్న తన దృష్టికి తీసుకవస్తే పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, బోయాకిషన్, పోశెట్టి గౌడ్, అగ్రవాసు, ముజీబ్, బషీర్, మజర్, మహేష్, రవీందర్, ఖలీమ్, నాగార్జున, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిజం ముసుగులో అక్రమ మార్గంలో వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకోవాలి




* ఏసీపీ ని కోరిన కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి ) : జర్నలిజం ముసుగులో అక్రమ మార్గంలో వసూళ్లకు పాల్పడుతున్న వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. శనివారం కూకట్ పల్లి ఏసిపి శ్రీనివాసరావును కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు కలిసి గౌరవప్రదమైన జర్నలిజం వృత్తిని అప్రతిష్టపాలు చేస్తున్నటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టులకు ప్రత్యేక గుర్తింపు ఉందని, జర్నలిస్టులది అతి కీలకమైన పాత్ర అని అన్నారు. సామాన్యులకు అండగా నిలవాల్సిన జర్నలిస్టులే వారిని ఇబ్బందులకు గురిచేస్తున్న సంఘటనలు వెలుగు చూస్తుండడం విచారకరమన్నారు. సమాజంలో ఈ పోకడలతో జర్నలిస్టులు అంటే సామాన్యులకు చులకన భావం ఏర్పడుతుందని ఆవేదన చెందారు. జర్నలిస్టుల విలువలను కాపాడాల్సిన అవసరం ఉందని ఏసిపిని కోరారు . ఈ మధ్యకాలంలో కొత్త దోరణిలతో జర్నలిస్టుల విలువలు మస్కబారే విధంగా కొందరు ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బోర్ల దగ్గరికి, సామాన్యులు ఇల్లు కట్టుకుంటే వారి దగ్గరికి వెళ్లి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా ఇలాంటి అక్రమాలకు పాల్పడితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. జర్నలిస్టుల పేరుతో సామాన్యులను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏసీపికి జర్నలిస్టులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో ఉన్న జర్నలిస్టులకు ప్రస్తుతం ఉన్నటువంటి వారికి చాలా వ్యత్యాసం కనిపిస్తుందన్నారు. జర్నలిస్టుల పట్ల సామాన్యులకు చులకన భావం ఏర్పడిందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. బాధితుల వద్ద నుంచి ఫిర్యాదులు అందితే కచ్చితంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు గడ్డమీది బాలరాజు, ఆర్. కె. దయాసాగర్, తొట్ల పరమేష్, నిమ్మల శ్రీనివాస్, ఎం ఏ కరీం, నవీన్ రెడ్డి, ఏబీఎన్ వేణు, నాగరాజు, క్రాంతి, గంగరాజు, సదా మహేష్, మాణిక్య రెడ్డి, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు అన్యాయం జరుగుతుంది

* సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : గత నాలుగు రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో అనేక అవకతవకాలు జరుగుతున్నాయని దీంతో పేద ప్రజలకు అన్యాయం జరుగుతుందని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ ఒక ప్రకటనలో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని మొత్తం 1వ డివిజన్ నుండి 33వ డివిజన్ వరకు ప్రతి డివిజన్లో వంద మందికి సొంత ఇల్లు వుండి భవనలు వున్న వారినే ప్రజ పాలనలో ప్రకటించిన లిస్టులో చేర్చారన్నారు. కేవలం 10% మంది పేద ప్రజలకే నిజాంపేట్ ఇల్లు లేని వారికీ లిస్టులో వచ్చాయని అన్నారు. మరీ పేద ప్రజలు అప్లై చేసిన కాగితాలు ఏ చెత్త డబ్బాలో వేశారు అని ప్రశ్నించారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అర్హులైన పేదలకు కాకుండా స్థానిక కార్పొరేటర్ వెనక వున్న కార్యకర్తలుకు ప్రభుత్వ పథకలైన ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డుల లిస్టోనీ పేర్లు చదివారు అని పేద ప్రజలు వాపోయారు అని అయన అన్నారు. కనుక వేంటనే అర్హులైన పేద ప్రజలకు కేటాయింపులు చేయాలనీ లేని పక్షంలో పెద్ద ఎత్తున పేద ప్రజలను సమీకరించి నిజాంపేట్ మున్సిపల్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

# సమాచార హక్కు చట్టం ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి

* బిజెపి రాష్ట్ర నాయకులు చికోటి ప్రవీణ్



ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్ : సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని బిజెపి రాష్ట్ర నాయకులు చికోటి ప్రవీణ్ అన్నారు. సమాచార హక్కు చట్టం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆర్టీఐ ఆధ్వర్యంలో మార్చి నెలలో రవీంద్ర భారతి లో జరిగే సమాచార హక్కు చట్టం అవగాహన సదస్సు పోస్టర్ ను శనివారం చికోటి ప్రవీణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల నుంచి సమాచారాన్ని అడిగి తీసుకునే అధికారమే సమాచార హక్కు, సామాన్యుడికి ఏ ఆఫీసుకు వెళ్లిన పని చేయించుకోవడం తనకు కావలసిన సమాచారాన్ని రాబట్టడం కష్టతరమైన నేపథ్యంలో భారత ప్రభుత్వం 12 అక్టోబర్ 2005 తేదీన ఈ సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. దీనిని ఉపయోగించుకొని ప్రభుత్వ పనులపై సమాచారాన్ని పొందవచ్చునని తెలిపారు. ప్రభుత్వ పాలనా వ్యవస్థలో ప్రతి భారత పౌరుడు సామాజిక బాధ్యతగా అవినీతి అక్రమాలను నిరోధించడానికి పేద ప్రజలకు ఆర్టీఐ ఆవశ్యకత ఎంతో ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్. చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక అధ్యక్షురాలు జి.ప్రియా రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గుండెల రాయుడు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి యార కార్తీక్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి రాసునూరి లక్ష్మణ్, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి వింజమూరి గణేష్,మేడ్చల్ జిల్లా కన్వీనర్ రామక్రిష్ణ, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు మల్లం శ్రీనివాస్,రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అంతటి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి లో జరుగు బహిరంగ సభను జయప్రదం చేయాలి

* సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : సంగారెడ్డి లో జరుగు బహిరంగ సభకు కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ ఉషోదయ టవర్స్ దగ్గర నుండి పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు తరలివెళ్ళారు. సిపిఎం తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభల సందర్భంగా శనివారం సంగారెడ్డి బయలుదేరి వెళ్లడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ సంగారెడ్డి లో నిర్వహిస్తున్న సిపిఐఎం రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా బహిరంగ సభకు ప్రజలు వేలాదిగా తరలిరావాలని అన్నారు ఈ మహాసభలో గత మూడు ఏళ్లలో ప్రజా సమస్యలపై చేసిన పోరాటాలను సాధించిన విజయాలను చర్చించి రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం చేయవలసిన పోరాటాలకు రూపకల్పన జరుగుతుందని. ఈరోజు జరిగే బహిరంగ




సభకు రాష్ట్ర నాలుమూలల నుండి ప్రజలు అధిక సంఖ్యలో హాజరవుతున్నారని తెలిపారు. మహాసభలకు పోలిట్ బ్యూరో సభ్యులు బృందా కరక్, బివి రాఘవులు, విజయ రాఘవన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తదితర నాయకులు పాల్గొని ప్రసంగిస్తారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పసుల అంజయ్య బి సత్యం జి వెంకన్న కే శీను తిమ్మప్ప ఆంజనేయులు మల్లారెడ్డి రాజేష్ వీరేష్ తదితరులు పాల్గొన్నారు

# ఉచిత లివర్ స్క్రీనింగ్ పరీక్షకు మంచి స్పందన



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి ) : కేపీహెచ్ బీ కాలనీ వసంత నగర్ సొసైటీ నందు రెనోవా హాస్పిటల్ వారి సౌజన్యంతో మందలపు రోజారాణి చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత లివర్ స్క్రీనింగ్ టెస్ట్ కు మంచి స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో సుమారు 200 మందికి పైగా హాజరయ్యి లివర్కు సంబంధించిన టెస్టులు చేపించుకున్నారు ఈ కార్యక్రమానికి కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరై ఈ టెస్ట్ ల గురించి వాటి యొక్క ప్రత్యేకతలు గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్లు ఈ టెస్టులు గురించి వివరాలు తెలియజేస్తూ లివర్ ఏ విధంగా ఉంటుంది. ఆ అవయవానికి సంబంధించి డాక్టర్లు క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ఇలాంటి టెస్టులు ప్రస్తుతానికి ఎక్కడ అందుబాటులో లేదని, ఇంతటి మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులు మందలపు సాయిబాబా చౌదరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో.ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్న గోరే, కాలనీ వాసులు శ్యామలరాజు, కృష్ణారెడ్డి, నాగేశ్వరరావు, రత్నాకర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ శ్రీ ఉమామహేశ్వరి నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి సహకరించాలని వినతి

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి రాజీవ్ గృహకల్ప లోని వెలసినటువంటి శ్రీ శ్రీ ఉమామహేశ్వరి నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి సహకరించాలని శనివారం కాలనీ వాసులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి వివరించారు. అదే విధంగా పలు సమస్యలను తెలియజేశారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పితాని శ్రీనివాసరావు, బాలకృష్ణ, లక్ష్మణ్,



రామచంద్రనాయక్, 14వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం శ్రీనివాసరావు, ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బస్తీలలో ప్రజలు ఎదుర్కోంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి

* కుత్బుల్లాపూర్ బీజేపీ అసెంబ్లి కన్వీనర్ జే.కె. శేఖర్ యాదవ్

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి ) : బస్తీలలో ప్రజలు ఎదుర్కోంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కుత్బుల్లాపూర్ బీజేపీ అసెంబ్లి కన్వీనర్ జే.కె.శేఖర్ యాదవ్ అన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ సూచన మేరకు శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఆధ్వర్యంలో ప్రజల అవసర్థం మగ్దూంనగర్ రోడ్డు సబ్ స్టేషన్ నుండి హెచ్ఎండిఏ ల్యాండ్ నుండి బీరప్ప నగర్ దేవమ్మ బస్తి గుబురు గుట్ట స్మశాన వాటిక, గాంధీనగర్ వెంకట్రామిరెడ్డి నగర్ వరకు లింకు



రూట్ ఏర్పాటు చేయాలని డిసి ని కోరడంతో పాటు డీఈ రూపా దేవి,ఎఈ తిరుపతి వచ్చి పరిశీలించడం జరిగింది అదే విధంగా జగద్గిరి నగర్ కమిటీ హాల్ పైన, రెండు ఫ్లోర్లు వేయాలని చెప్పి కోరడం జరిగింది. దానికి వారు సానుకూలంగా స్పందించి వెంటనే ప్రపోజల్సు తయారుచేసి సాంక్షన్ చేపిస్త మని చెప్పినారు. ఈ కార్యక్రమంలో గండి రాజు యాదవ్ సత్యనారాయణ యాదవ్ పాండు గోవర్ధన్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు



# ఆల్కహాల్‌పై కంట్రోల్ తప్పుతున్నారా?.!

మద్యం విపరీతంగా తాగడం వల్ల చాలా అనారోగ్య సమస్యలు వస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతుంటారు. అది మెదడును తీవ్రంగా ప్రభావితం చేస్తుందంటున్నారు. ఆల్కహాల్ వల్ల మెదడులోని ఐదు ముఖ్యమైన ప్రాంతాలు ప్రభావితమవుతున్నాయి. అవేంటో తెలుసుకుందాం.







### న్యూరో ట్రాన్స్ మీటర్ యాక్టివిటీ

న్యూరోట్రాన్స్‌మీటర్లు మెదడులోని నరాల సందేశాల మార్పిడిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఆల్కహాల్ ఈ న్యూరోట్రాన్స్‌మీటర్ల పనితీరును మారుస్తుంది. ఇది ఆలోచనా శక్తిని తగ్గిస్తుంది.

### మెదడు నిర్మాణం

అతిగా మద్యం తాగడం వల్ల మెదడు నిర్మాణంలో మార్పులు వస్తాయి. ఇది మెదడు కణజాల పరిమాణాన్ని తగ్గిస్తుంది. ద్రవంతో నిండిన మెదడు జఠరికల పరిమాణాన్ని పెంచుతుంది. ఫలితంగా వ్యక్తి ఆలోచనా సామర్థ్యం బలహీనపడుతుంది. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, నిర్ణయం తీసుకోవడంలో ఇబ్బంది ఉంటుంది.

### న్యూరోకెమికల్ అసమతుల్యత

ఆల్కహాల్ ఎక్కువ తీసుకోవడం వల్ల న్యూరోట్రాన్స్‌మీటర్ల సున్నితమైన సమతుల్యత దెబ్బతింటుంది. ఈ అసమతుల్యత డిప్రెషన్, ఆందోళన వంటి మానసిక వ్యాధులకు దారితీస్తుంది. అలాగే ఇది స్వీయ నియంత్రణను తగ్గిస్తుంది.

### మెసోలింబిక్ మార్గం

ఆల్కహాల్ డోపమైన్ స్థాయిలను పెంచడం ద్వారా మెదడు మెసోలింబిక్ వ్యవస్థను సక్రియం చేస్తుంది. ఇది ఆనందం ఉద్దీపన అనుభూతిని కలిగిస్తుంది. కాలక్రమేణా ఈ రివార్డ్ మార్గాలు పదేపదే మద్యం తాగడంతో సున్నితంగా మారతాయి.

### మెదడు పనితీరు

ఆల్కహాల్ సమస్య పరిష్కారానికి తీసుకునే చర్యలను ప్రభావితం చేస్తుంది. ఇది సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. రిస్క్ తీసుకునే ప్రవర్తనను పెంచుతుంది.

---

# పిల్లలు హైట్ పెరగాలంటే..

ప్రస్తుత జనరేషన్‌లో తల్లిదండ్రులు తమ పిల్లల గురించి చాలా శ్రద్ధ తీసుకోవాలి. వారు పుట్టినప్పటి నుంచి పెరిగేదాకా జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. కొంతమంది పిల్లలు వయసుకు తగ్గట్లుగా హైట్ పెరగరు. దీనికి అనేక కారణాలు ఉంటాయి. ముందుగా పిల్లలకి సరైన పోషకాహారం లభిస్తుందో లేదో గమనించాలి. పోషక విలువలు అందించకపోతే బిడ్డ ఎదుగుదల ఆగిపోతుంది. ఈ రోజుల్లో పిల్లలు ఫాస్ట్, జంక్ ఫుడ్స్ తినడానికి ఇష్టపడుతున్నారు. కానీ ఇవి ఆరోగ్యానికి మంచిది కాదు. పిల్లలు హైట్ పెరగడానికి కొన్ని ఆహారాలు అందించాలి.






### పాలు

పాలలో అన్ని రకాల పోషకాలు ఉంటాయి. పాలు సంపూర్ణ ఆహారం అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇందులో ఉండే క్యాల్షియం, ప్రొటీన్ పిల్లల ఎముకలు, కండరాల అభివృద్ధికి తోడ్పడతాయి. పిల్లలకు ఉదయం సాయంత్రం పాలు తాగేలా చూసుకోవాలి.

### గ్రీన్ లీఫీ వెజిటబుల్స్

కొంతమంది పిల్లలు ఆకు కూరలు తినడానికి ఇష్టపడరు. బదులుగా ఆయిల్, జంక్ ఫుడ్‌ను ఇష్టపడతారు. తల్లిదండ్రులు పిల్లలకు ఆకుపచ్చ కూరగాయలను తినిపించడం చాలా ముఖ్యం. ఎందుకంటే ఇందులో ఐరన్, మెగ్నీషియం, ఫైబర్, ఫోలేట్, పొటాషియం, కాల్షియం, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ కె ఉంటాయి. ఇవి పిల్లల ఎత్తును పెంచడంలో సాయపడుతాయి.

### పండ్లు

అన్ని వయసుల వారు పండ్లు తినమని సలహా ఇస్తారు. ఎందుకంటే ఇవి ఆరోగ్యానికి చాలా మంచివి. వీటిలో విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఈ రోజు నుంచే పిల్లలకు పండ్లు తినిపించడం అలవాటు చేయండి.

### గుడ్డు

గుడ్లలో ప్రొటీన్ అధికంగా ఉంటుంది. పిల్లలకు అల్పాహారంలో ఉడికించిన గుడ్లను తప్పక తినిపించాలి. ఇందులో ప్రొటీన్‌తోపాటు, పిండి పదార్థాలు, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరం పెరుగుదలపై పాజిటివ్ ప్రభావాన్ని చూపుతుంది.

---

# లివర్ డ్యామేజ్ లక్షణాలు ఇవే..



లివర్ శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవం. బాడీలో జరిగే అన్ని పనుల్లో దీని సహకారం ఉంటుంది. ఇది శరీరంలోని మలినాలను బయటికి పంపిస్తుంది. అయితే కొన్ని కారణాల వల్ల లివర్ డ్యామేజ్ అవుతుంది. కానీ డ్యామేజ్ లక్షణాలు తొందరగా బయటపడవు. ఆలస్యంగా తెలియడం వల్ల అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ఆల్కహాల్ తాగేవారిలో లివర్ వ్యాధులు ఎక్కువగా వస్తాయనడంలో సందేహం లేదు. కానీ వైరల్ ఇన్ఫెక్షన్, ఊబకాయం, జన్యు కారణాల వల్ల కూడా లివర్ సమస్యలు ఏర్పడుతాయి. ఇలాంటి సందర్భంలో వాటిని ముందుగా గుర్తించడం అవసరం. అలాంటి వాటి గురించి ఈ రోజు తెలుసుకుందాం.

### మలం రంగులో మార్పు

మలం మట్టి రంగులో మారితే లివర్ పనిచేయడం లేదని అర్థం. సిర్రోసిస్ వంటి వ్యాధులలో లివర్ వాపునకు గురవుతుంది. ఇది పొట్ట విస్తరణగా కారణమవుతుంది. పాదాలు, చీలమండల వాపు కూడా సంభవిస్తుంది. లివర్ వ్యాధి ఉన్న రోగులకు చర్మం కింద పిత్త లవణాలు పేరుకుపోవడం వల్ల నిరంతర దురద ఉంటుంది. ఈ దురద ఎక్కడైనా రావచ్చు కానీ అరచేతులు, అరికాళ్లలో ఎక్కువగా వస్తుంది. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ని సంప్రదించి లివర్ టెస్ట్ చేయించుకోవాలి.

### అలసట, బలహీనత

నిరంతర అలసట, బలహీనత కాలేయ వ్యాధికి ప్రారంభ సంకేతాలు. ఇలాంటి సందర్భంలో వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలి. పొట్ట పైభాగంలో నొప్పి లివర్ వాపునకు సంకేతం. ఈ నొప్పి తేలికపాటి నుంచి తీవ్రంగా మారుతుంది. కొవ్వు పదార్థాలు తిన్న తర్వాత మరింత పెరుగుతుంది. లివర్ సమస్యల వల్ల మూత్రం రంగు మారుతుంది. ఈ స్థితిలో మూత్రం రంగు టీ రంగు లేదా గోధుమ రంగులోకి మారుతుంది.



## ఫెమీనా కవర్‌పై రష్మిక మందన్న ఫోజ్




**టాకీస్:** వరుసగా పాన్ ఇండియా సినిమాల్లో నటిస్తూ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది రష్మిక మందన్న. అగ్ర హీరోల సినిమాల్లో నటనకు ఆస్కారం ఉన్న పాత్రలతో అదరగొడుతోంది. యానిమల్, పుష్ప 2 లాంటి బ్లాక్ బస్టర్ హిట్స్ లో నటించిన రష్మిక మందన్న తదుపరి 'చావా' లాంటి భారీ హిస్టారికల్ డ్రామాలో నటించింది. ఈ చిత్రంలో విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో నటించిన సంగతి తెలిసిందే. శివాజీ మహారాజ్ కుమారుడు శంభాజీ భార్య ఏసుభాయి పాత్రలో రష్మిక నటించింది. త్వరలోనే ఈ చిత్రం విడుదల కానుంది. ఇంతకు ముందు కాలికి గాయంతో కుంటుకుంటూ చావా ప్రచార కార్యక్రమంలో రష్మిక పాల్గొన్న సంగతి తెలిసిందే. మరోవైపు రష్మిక మందన్న వరుస ఫోటోషూట్లు ఇంటర్నెట్ లో దర్శనమిస్తున్నాయి. తాజాగా ఫెమినా ఇండియా కవర్ ఫోటోషూట్ తో అభిమానులను ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. రష్మిక నేటితరంలో దూసుకుపోతున్న గ్రేట్ సూపర్ స్టార్ అంటూ ఫెమీనా కీర్తించింది. ఈ సంవత్సరాన్ని రష్మిక మందన్నతో ప్రారంభిస్తున్నాం! అంటూ ఫెమీనా ఆనందం వ్యక్తం చేసింది. నేటి ప్రపంచంలో సూపర్ స్టార్ అంటే ఏమిటో రష్మిక రీడిఫైన్ చేస్తున్నారు. పుష్ప 2 అద్భుతమైన విజయంతో, ఈ అందాల సుందరి మన తరంలో అత్యంత ఆరాధించే కథానాయికలలో ఒకరిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. తన అసమాన ప్రతిభ, ఆక ర్షించే ఉనికి, సరిహద్దులు దాటి ప్రేక్షకులతో కనెక్ట్ అయ్యే సామర్థ్యంతో రష్మిక లక్షలాది మందిని ఆకర్షిస్తూనే ఉంది. ప్రపంచాన్ని ఆక్రమించుకుంటున్న ఆ స్టార్ గురించి ప్రత్యేక కథనమిది.. అం టూ ఫెమినా ప్రత్యేక స్టోరీని షేర్ చేసింది.



## 28న నాగ చైతన్య 'తండేల్' ట్రైలర్ రిలీజ్

**టాకీస్:** టాలీవుడ్ నటుడు అక్కినేని నాగ చైతన్య ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం తండేల్. మలయాళీ బ్యూటీ సాయి పల్లవి కథనాయికగా నటిస్తుండగా.. చందు మొండేటి దర్శకత్వం వహిస్తున్నాడు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై అల్లు అరవింద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఫిబ్రవరి 07న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్ నిర్వహిస్తుంది చిత్రబృందం. తాజాగా తండేల్ ట్రైలర్ అప్‌డేట్‌ను ఇచ్చారు మేకర్స్. ఈ సినిమా ట్రైలర్‌ను జనవరి 28న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. ఈ సినిమా విషయానికి వస్తే.. బతుకుదెరువు కోసం గుజరాత్‌లోని వీరవల్‌కు వెళ్లిన నాగ చైతన్య సముద్రవేట చేస్తూ పాకిస్థాన్ కోస్టుగార్డులకు చిక్కుతాడు. అయితే పాకిస్థాన్ జైలు నుంచి అతడు ఎలా బయటపడ్డాడు అనే స్టోరీతో ఈ సినిమా రానుంది. ఇక ఇందులోనే కొంచెం ప్రేమ కథ, దేశభక్తి అంశాలు జోడించి కమర్షియల్ గా తెరకెక్కిస్తున్నారు మేకర్స్.

### 'గాంధీ తాత చెట్టు' సినిమాపై
## రామ్ చరణ్, ఉపాసన ప్రశంసలు



**టాకీస్:** టాలీవుడ్ అగ్ర దర్శకుడు సుకుమార్ కూతురు సుకృతి వేణి బండ్రెడ్డి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం గాంధీ తాత చెట్టు. ఈ సినిమా జనవరి 24న ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతుంది. ఇప్పటికే ఈ సినిమా చూసిన సూపర్ స్టార్ మహేశ్ బాబుతో పాటు పలువురు సినీ ప్రముఖులు చిత్రంపై ప్రశంసలు కురిపించారు. అయితే తాజాగా రామ్ చరణ్ దంపతులు కూడా ఈ సినిమా చూసి సుకృతి వేణి బండ్రెడ్డి ప్రశంసలు కురిపించడంతో పాటు తాజాగా గాంధీ తాత చెట్టు టీమ్‌ని కలుసుకుని వారికి అభినందనలు తెలిపారు. ఇక రామ్ చరణ్ ఉపాసన కలిసిన వారిలో చిత్ర సమర్పకురాలు శ్రీమతి తబితా సుకుమార్‌తో పాటు, దర్శకురాలు పద్మ మల్లాది తదితరులు ఉన్నారు.

మరోవైపు ఈ సినిమా విడుదలకు ముందే అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో నటనకు గాను దుబాయ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, దాదా సాహెబ్ ఫాల్కే, ఇండియన్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ తొలి సినిమా బాలనటిగా సుకృతి వేణి బండ్రెడ్డి అవార్డు అందుకుంది.



## బెనిఫిట్ షోలు రద్దు.. మరోసారి క్లారిటీ ఇచ్చిన తెలంగాణ హైకోర్టు

**టాకీస్:** తెలంగాణలో సినిమా బెనిఫిట్ షోలకు సంబంధించి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేసింది తెలంగాణ హైకోర్టు. భవిష్యత్‌లో బెనిఫిట్ షోలకు అనుమతి లేదంటూ వెల్లడించింది. సినిమా టికెట్ ధరల పెంపు, స్పెషల్ షోలకు సంబంధించిన పిటిషన్‌కి సంబంధించి హైకోర్టులో విచారణ జరుగగా.. ప్రభుత్వం తరపున న్యాయవాది తన వాదనాలు వినిపిస్తూ.. సంక్రాంతి సమయంలో సినిమా టికెట్ ధరలను పెంచుకోవడానికి ఇచ్చిన అనుమతులను ప్రభుత్వం రద్దు చేసినట్లు న్యాయస్థానానికి వివరించారు.

ఇక ప్రభుత్వం తరపు వాదానలు విన్న ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. బెనిఫిట్ షోలకి అనుమతి లేదంటూ తెలిపింది. సినిమాటోగ్రఫీ యాక్ట్ ప్రకారం.. అర్ధరాత్రి 1.30 గంటల నుంచి ఉదయం 8.40 వరకు గల మధ్య సమయంలో ఎలాంటి ప్రత్యేక షోలకు అనుమతి లేదని.. ఈ చట్టాన్ని పాటించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ కేసుపై తదుపరి విచారణను ఫిబ్రవరి 21కి వాయిదా వేసింది. అయితే హైకోర్టు ఇచ్చిన కొత్త ఆదేశాల ప్రకారం.. తెలంగాణలో ఇకముందు బెనిఫిట్ షోలు, టికెట్ రేట్లు రద్దయినట్లు తెలుస్తుంది.

## చీరలో ముస్తాబయిన స్రవంతి చొక్కారపు.. చూడచక్కగా ఉందే..!

**టాకీస్:** ప్రస్తుతం బుల్లితెరపై యాంకర్ల మధ్య కూడా గట్టి పోటీ ఉంది. ఆ పోటీని దాటుకుంటూ ఒక యాంకర్ తన సెకండ్ ఇన్నింగ్స్‌ను గ్రాండ్‌గా ప్రారంభించింది. తనే స్రవంతి చొక్కారపు. ఎన్నో ఏళ్లుగా బుల్లితెరపై యాంకర్‌గా వెలిగిపోతోంది స్రవంతి. కానీ ఉన్నట్టుండి పోటీ తట్టుకోలేక వెనక్కి తప్పుకుంది. బిగ్ బాస్‌లోకి కంటెస్టెంట్‌గా ఎంటర్ అయిన తర్వాత స్రవంతిని యాంకర్‌గా మరోసారి గుర్తించారు బుల్లితెర మేకర్స్. బిగ్ బాస్‌లోకి కంటెస్టెంట్‌గా ఎంటర్ అయిన తర్వాత స్రవంతిని యాంకర్‌గా మరోసారి గుర్తించారు బుల్లితెర మేకర్స్. బిగ్ బాస్ నుండి బయటికి వచ్చిన తర్వాత మళ్లీ బ్యాక్ టు బ్యాక్ షోలు, ఈవెంట్స్‌తో బిజీ అయిపోయింది స్రవంతి. ప్రస్తుతం ఎక్కువగా మూవీ ఈవెంట్స్‌ల్లో యాంకరింగ్ చేస్తూ గడిపేస్తోంది స్రవంతి చొక్కారపు. యాంకర్‌గా వరుస ఆఫర్లు అందుకుంటున్న సమయంలోనే సోషల్ మీడియాలో గ్లామర్ డోస్ పెంచేసింది స్రవంతి. వరుస ఫోటోషూట్స్, అందులో మోడర్న్ డ్రెస్సులతో అందరినీ ఆశ్చర్యపరిచింది. స్రవంతి ఇలా కూడా ఉండగలదా అని అందరూ షాకయ్యారు. చాలావరకు తన సోషల్ మీడియా వల్ల మళ్లీ లైమ్‌లైట్‌లోకి వచ్చింది స్రవంతి. ఇప్పటికీ ఈవెంట్స్ ఉన్నా లేకపోయినా అందంగా ముస్తాబయ్యి ఆ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తుంది. తాజాగా పింక్ శారీలో అందంగా నవ్వుతూ ఫోటోలు అప్లోడ్ చేసింది. ఎప్పుడూ మోడర్న్ డ్రెస్సులోనే కనిపించినా.. అప్పుడప్పుడు ఇలా శారీలో కూడా బాగుంటుందని స్రవంతిపై ప్రశంసలు కురిపిస్తున్నారు ఫాలోవర్స్.




### హైదరాబాద్ కమిషనర్ చేతుల మీదుగా
## 'కానిస్టేబుల్' టైటిల్ సాంగ్ రిలీజ్



**టాకీస్:** కొత్త బంగారు లోకం, హ్యాపీడేస్, కుర్రాడు సినిమాలతో టాలీవుడ్ ఇండస్ట్రీని షేక్ చేశాడు నటుడు వరుణ్ సందేశ్. అయితే ఈ సినిమాలు ఇచ్చిన బ్రేక్‌తో స్టార్ నటుడుగా మారుతాడు అనుకున్న సమయంలో వరుస ఫ్లాప్‌లు అతడిని కిందకి దించేశాయి. ప్రస్తుతం ఆడపదడపా సినిమాలు చేస్తూ వస్తున్నాడు. గతేడాది నింద సినిమాతో వచ్చి మంచి మార్కులు సంపాదించాడు. ఇదిలావుంటే ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం కానిస్టేబుల్. ఈ సినిమాకు ఆర్యన్ సుభాన్ దర్శకత్వం వహిస్తుండగా.. జాగృతి మూవీ మేకర్స్ పతాకంపై బలగం జగదీష్ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఇప్పటికే మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకుంది.

అయితే తాజాగా ఈ సినిమా నుంచి కానిస్టేబుల్ ప్రమోషనల్ సాంగ్‌ను హైదరాబాద్ కమిషనర్ సీవీ ఆనంద్ చేతుల మీదుగా చిత్రబృందం లాంఛ్ చేయించింది. కానిస్టేబుల్ అన్నా అనే టైటిల్‌తో వచ్చిన ఈ పాట కానిస్టేబుళ్ల కృషి, అంకితభావం, త్యాగాలకు గుర్తుకుతెస్తుందని చిత్రబృందం వెల్లడించింది. ఈ సాంగ్ విన్న హైదరాబాద్ కమిషనర్ సినిమా విజయం సాధించాలని చిత్రబృందానికి విషెస్ తెలిపాడు. సుభాష్ ఆనంద్ సంగీతం అందించిన ఈ పాటను నల్గొండ గద్దర్ నర్సన్న పాడారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న నటుడు నితిన్

**టాకీస్:** టాలీవుడ్ నటుడు నితిన్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ దర్శన సమయంలో కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకొన్నారు. తన కొడుకుతో మొదటిసారి ఆలయానికి వచ్చిన నితిన్ కుటుంబ సభ్యులను ఆలయ అర్చకులు ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందచేశారు. ఆలయం వెలుపల హీరో నితిన్‌ను చూడటానికి, వారితో ఫోటోలు దిగడానికి భక్తులు ఉత్సాహం చూపారు.







Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.